TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు   తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :96 | శనివారం 23-11-2024 | పేజీలు : 5 | వెల :4/-

# రూ .5,260 కోట్ల పెట్టుబడులు

- కాలుష్య రహితంగా గ్రీన్ ఫార్మా కంపెనీల ఏర్పాటు ముందుకొచ్చిన ఆరు
- కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు సిఎం సమక్షంలో
- సంతకాలు ఫార్మా సిటీలో స్థలాల కేటాయింపు కంపెనీల నిర్మాణానికి
- తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం



**హైదరాబాద్:** దేశంలో పేరొందిన ఫార్మా కంపెనీలు హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. శుక్రవారం ప్రభుత్వంతో జరిగిన ఒప్పందంతో ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ. 5,260 కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. తమ కంపెనీల కార్యకలాపాల విస్తరణతో పాటు కాలుష్య రహితంగా ఏర్పాటు చేసే గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో పలు పరిశ్రమలు ఈ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ ఒప్పందాలకు సంబంధించి సంప్రదింపులు జరిపారు. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్‌ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీల ప్రతినిధులు, టిఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం**

ఈ సందర్భంగా ఫార్మా కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ఎంఓయూలపై సంతకాలు చేశారు. ఈ ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ. 5,260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించనుంది.

ఎంఓయూల ఒప్పందాల ప్రకారం ఎంఎస్ఎన్ లాబోరేటరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ నెలకొల్పనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ ఫార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్ స్టన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను

మిగతా 2లో

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

## 10 మంది మావోయిస్టులు మృతి

- భెజ్జీ ప్రాంతంలో కాల్పుల పోరు
- ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి నక్సల్స్ ప్రవేశం సమాచారంతో డిఆర్‌జి ఆపరేషన్
- ఎన్‌కౌంటర్ జరిగినట్లు ఎస్‌పి కిరణ్ చవాన్ ధ్రువీకరణ



**రాయిపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని కొంటాలో భద్రత దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించారు. భెజ్జీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారు జామున ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్‌పి) కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. ఘటన స్థలి నుంచి భద్రత దళాలు మూడు ఆటోమేటిక్ తుపాకులు సహా పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి నక్సలైట్లు ప్రవేశిస్తున్నారనే పక్కా సమాచారంతో జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) ఈ ఆపరేషన్ చేపట్టింది.కాగా, ఎన్‌కౌంటర్ జరిగినట్లు బస్తర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి) పి సుందర్‌రాజ్ కూడా ధ్రువీకరించారు. అయితే, మృతుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం ఇంకా కాల్పులు సాగుతూనే ఉన్నాయని 'పిటిఐ' వార్తా సంస్థ తెలియజేసింది. ఇది ఇలా ఉండగా, క్రితం నెల ఛత్తీస్‌గఢ్‌లోని .నారాయణ్‌పూర్ దంతెవాడ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో 31 మంది మావోయిస్టులను భద్రత దళాలు కాల్చి చంపిన విషయం విదితమే. ఆ ఎన్‌కౌంటర్ సమయంలోను భద్రత దళాలు భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి.

# అదానీతో ఒప్పందాలు సమీక్షిస్తాం

- చట్టానికి లోబడిన ఒప్పందాలే కొనసాగుతాయి
- అదానీ అవినీతి నిరూపితమైతే ఒప్పందాలు రద్దు చేసుకుంటాం
- ఇప్పటివరకు ఆయనకు రాష్ట్రంలో ఇంచు భూమి కూడా ఇవ్వలేదు
- స్కిల్ యూనివర్శిటీకి ఇచ్చిన రూ.100 కోట్ల విరాళం రేవంత్ జేబులోకి పోలేదు.. రేపు కెటిఆర్ విరాళమిచ్చినా స్వీకరిస్తాం
- త్వరలోనే కాంగ్రెస్‌లో చేరికలు: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్




**హైదరాబాద్:** అదానీ పెట్టుబడులపై పునరాలోచిస్తామని, చట్టానికి లోబడే వ్యాపారాలు చేసే వారిని రాష్ట్రంలోకి అనుమతి ఇస్తామని, అది అదానీ అయినా అంబానీ అయినా ఒకటే రూల్ అని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. అదానీ అవినీతి నిరూపితమైతే ఆయన పెట్టే పెట్టుబడులను రద్దు చేసుకుంటామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రభుత్వం దావోస్‌లో రూ.45 వేల నుంచి రూ.50 వేల కోట్ల ఒప్పందాలను చేసుకుందని, అందులో సక్రమంగా ఉన్నవాటితోనే తమ ఒప్పందాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. అదానీకి ఇప్పటివరకు ఇంచు భూమి కూడా ఇవ్వలేదని స్కిల్ యూనివర్సిటీకి అదానీ రూ.100 కోట్ల విరాళం ఇచ్చారన్నారు. అవి రేవంత్ రెడ్డి సొంత పాకెట్ మనీకోసం ఇవ్వలేదని ప్రజా అవసరాలకు ఇచ్చిన విరాళం అని ఆయన పేర్కొన్నారు. రేపు కెటిఆర్ వచ్చి రూ. 50 కోట్ల విరాళం ఇస్తామంటే స్వీకరిస్తామన్నారు. గతంలో ఈ రాష్ట్రంలో

మిగతా 2లో

# పండగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలు

- ప్రజా ప్రభుత్వం అమలు చేసిన లపథకాలు గడప గడపకు చేరేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలి
- ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలి
- అన్ని శాఖల అధికారులు ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు జరపాలి
- ఈనెల 30న మహబూబ్ నగర్ లో రైతు దినోత్సవం సభ
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాల్లో కార్నివాల్, లేజర్ షో
- రాష్ట్రస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క




**హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చెరవేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం సచివాలయంలో సమావేశమైంది. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ– సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావడంతో ప్రజా విజయోత్సవాలు ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్.బీ స్టేడియంలో

మిగతా 2లో

# ములుగు జిల్లాలో ఇద్దరు ఇన్ ఫార్మర్ల దారుణ హత్య

**ములుగు ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :** తెలంగాణ రాష్ట్రంలో సుదీర్ఘ కాలం తర్వాత మావోయిస్టు లు బీభత్సం సృష్టించారు. పోలీస్ ఇన్ ఫార్మర్స్ నెపంతో ఓ ప్రభుత్వ ఉద్యోగస్తుడి తో సహా ఇద్దరిని హతమార్చారు. ఈరోజు తెల్లవారుజామున వారి ఇళ్ల వద్ద నరికి చంపి పోలీసులకు సవాల్ విసిరారు. ఈ జంట హత్యలు ములు గు జిల్లా వాజేడు మండలం జంగాలపల్లిలో జరిగాయి. తెల్లవారుజామున ఎటాక్ చేసిన మావోయిస్టులు ఇరువురి ని హతమార్చారు. మృతులు ఈక అర్జున్, ఈక రమేష్ అనే ఆదివాసీలుగా గుర్తించారు. మృతుడు ఈక రమేష్ ప్రభుత్వ ఉద్యోగి గ్రామ పంచాయతీ సెక్రటరిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. వీరిని నరికి చింపిన మావోయిస్టులు సంఘటనా స్థలంలో రెండు లేఖలు వదిలి వెళ్లారు. ఈ లేఖలు వెంకటాపురం, వాజేడు ఏరియా కార్యదర్శి శాంత పేరుతో ఉన్నాయి. మృతుడు రమేష్ పేరూరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ పోలీస్ ఇన్ఫార్మర్ గా మారాడని, పక్కనే ఉన్న చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కూడా మావోయిస్టుల కదలికలు పసిగట్టి పోలీసులకు సమాచారం ఇచ్చే వాడని లేఖలో ఆరోపించారు. ఎస్బిఐ డైరెక్షన్ మేరకు ఛత్తీస్ ఘడ్, తెలంగాణా






సరిహద్దులోని లంకపల్లి, జన్నప్ప, ఊట్ల, శ్యామల దొడ్డి, వాయిపేట గ్రామాల్లో స్నేహితులను ఏర్పాటు చేసుకొని మావోయిస్టుల సమాచారం సేకరిస్తు న్నాడని లేఖ లో పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో జరిగిన పలు ఘాతుకాలకు పంచాయితీ కార్యదర్శి రమేష్ కారణమని లేఖలో పేర్కొన్నారు. వాజే డు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఈక అర్జున్ చేపలవేట పేరుతో అడవికి వచ్చి మావోయిస్టులు డెన్నుల ను పసిగట్టి పోలీసులకు సమాచారం అందిస్తున్నాడని ఆరోపించారు.వీరిద్దరూ పద్ధతి మార్చుకోక పోవడంతో హతమార్చా మని లేఖలో పేర్కొన్నారు.

# అదానీతో ఒప్పందాలు సమీక్షిస్తాం

అదానీ కార్యకలాపాలు ఉన్నాయని అప్పుడు అదానీ డబ్బులు వారికి వ్యక్తిగతంగా ముట్టాయా అని ఆయన ఆరోపించారు. చట్టరీత్యా వ్యాపారాలు చేసుకుంటే తెలంగాణ ప్రభుత్వానికి ఎటుంటి అభ్యంతరం లేదన్నారు.

**జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్టును**

ప్రస్తుతం బయటకు వచ్చిన అంశంపై జేపిసి (జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్టును) కోరుతున్నామన్నారు. జేపిసి ఏర్పాటై నిష్పక్షపాతంగా విచారణ జరిగితే మోడీ ప్రధానిగా తప్పుకోవాల్సి వస్తుందన్నారు. అదానీ అవినీతిపై రాహుల్ గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదన్నారు.

అర్హత లేకపోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. 2014 తర్వాత అదానీ ఆస్తులు ఎలా పెరిగాయని ఆయన ప్రశ్నించారు. ఈ దేశంలో దోపిడీ జరుగుతుంటే మోడీ కళ్లు మూసుకున్నారా అని ఆయన నిలదీశారు. మోడీ అండతోనే అదానీ అవినీతి సామ్రాజ్యం నిర్మించారని ఆయన మండిపడ్డారు. అదానీ దాదాపు రూ.2 వేల కోట్ల లంచాలు పంచారని ఆయన ఆరోపించారు. 2014 నుంచి -2024 కేంద్ర లావాదేవీల్లో అదానీ పాత్ర ఉందన్నారు.

**బిఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టు పోయినా తమకు న్యాయమే**

త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో మరిన్ని చేరికలు ఉంటాయని, ఎంతమంది చేరుతారో త్వరలోనే క్లారిటీ ఇస్తామని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

కెటిఆర్‌కు అత్యంత దగ్గరగా ఉండేవారు కూడా తమతో టచ్‌లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన తమ పార్టీలో మరింతమంది బిఆర్ఎస్ కీలక నేతలు చేరబోతున్నట్టు ఆయన ప్రకటించారు. పార్టీ ఫిరాయింపులపై త్వరలోనే స్పీకర్ తన అధికారాన్ని ఉపయోగించి నిర్ణయం తీసుకుంటారని ఆయన అన్నారు. బిఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టు పోయినా తమకు న్యాయమే జరుగుతుందన్నారు. తాము చేసిన మంచి పనులు చూసి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వస్తున్నారన్నారు. కాంగ్రెస్‌తో ఎంతమంది టచ్‌లో ఉన్నారన్నది త్వరలోనే తెలుస్తుందన్నారు.

**సెబీ చైర్మన్‌ను తొలగించాలి**

దేశంలో దొపిడీ జరుగుతుంటే మోడీ కళ్లు మూసుకున్నారా అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే అదానీని అరెస్టు చేయాలని పిసిసి అధ్యక్షుడు డిమాండ్ చేశారు.

అదానీ ఇష్యూలో సెబీ పూర్తిగా విఫలమైందని సెబీ చైర్మన్‌ను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో ఈడీ, సిబిఐలు ప్రధాని గుప్పెట్లో పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు. 90 శాతం ఏజెన్సీ తనిఖీలు ప్రతిపక్ష నేతలపైనే జరిగాయని ఆయన ఆరోపించారు. బిజెపి పెత్తందారుల పార్టీ కార్పొరేట్ల కోసమే ఆ పార్టీ పనిచేస్తోందన్నారు.

# పండగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలు

పాఠశాల విద్యార్థుల దినోత్సవం, వరంగల్‌లో మహిళా దినోత్సవం కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, ఈనెల 30 న మహబూబ్ నగర్ లో రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాల్లో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల ఉత్సవాల్లో మహిళలు, పిల్లలు, పౌరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే ప్రతి జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా జరుగుతున్నాయని, ప్రతి గ్రామ స్థాయి నుండి, మండలాలు, జిల్లా స్థాయి వరకు ఈ ప్రజా విజయోత్సవాలు పండగ వాతావరణంలో నిర్వహించాలన్నారు.

ప్రతి శాఖలో ఈ సంవత్సర కాలంలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలపై అంతర్గతంగా వేడుకలు నిర్వహించుకోవాలని డిప్యూటీ సి.ఎం ఆదేశించారు. ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విజయాలను ప్రతి వ్యక్తికీ చేరవేసేలా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లను విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది పాలనలో సాధించిన విజయాలను సక్సెస్ స్టోరీలను తమ వెబ్ సైట్‌లో సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 లక్షల స్వయం సహాయక మహిళలకు సున్నా వడ్డీ పథకం, బ్యాంకు లింకేజీలు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ తదితర మహిళా సాధికారత పథకాల వివరాలన్నీ వారికి చేరవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన హోర్డింగులు, షార్ట్ ఫిలింలు, తదితర ప్రచార అంశాలను హోర్డింగులు, ప్రకటనలు, సోషల్ మీడియాలా ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న దాదాపు 25 వేల ఆర్టీసీ బస్సుల పై ఈ హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా ప్రభుత్వ గ్యారంటీలలో భాగంగా అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ. 500 లేక్ గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ కవరేజీ పెంపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ సంస్థల ఏర్పాటు తదితర పథకాలపై పాఠశాల విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ఈ ప్రజా విజయోత్సవాలు పురస్కరించుకుని రాష్ట్రంలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల ప్రారంభోత్సవం, 200 విద్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభం, 9007 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేయడం, ఆరు ప్రధాన పాలసీలను ముఖ్యమంత్రిచే ప్రారంభించుకోవడం తదితర కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఈ ప్రజా విజయోత్సవాల నిర్వహణపై వివిధ శాఖల కార్యదర్శుల సలహాలు, సూచనలను డిప్యూటీ సిఎం స్వీకరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, శ్రీధర్, క్రిస్టినా జోంగ్తు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, హైదరాబాద్, సైబరాబాద్ నగర పోలీస్ కమీషనర్లు సీ.వీ ఆనంద్, మొహంతి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్, ఫైర్ సర్వీసుల డీజీ నాగి రెడ్డి, సిఎంఓ అధికారులు షా నవాజ్ కాసీం, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, శ్రీరామ్ కర్రి వివిధ శాఖల కార్యదర్శులు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎంఎల్ఎల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

**హైదరాబాద్ :** ఎంఎల్ఎల అనర్హత పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. పార్టీ ఫిరాయించిన ఎంఎల్ఎల అనర్హత పిటిషన్‌లపై షెడ్యూల్ ఖరారు చేయాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని.. ఆ అర్హత స్పీకర్‌కు ఉందని సూచించింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఎంఎల్ఎల అనర్హతపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. కాగా, బిఆర్ఎస్ పార్టీపై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా అదేశాలు ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ ఎంఎల్ఎలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద పిటిషన్ దాఖలు వేశారు.

వీటితో పాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ అనర్హత పిటిషన్లను స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబర్ 9న ఈ పిటిషన్లను విచారించిన సింగిల్ బెంచ్, నాలుగు వారాల్లో అనర్హత పిటిషన్లపై షెడ్యూల్ ఖరారు చేయాలని తీర్పు వెలువరించింది. బిఆర్ఎస్ ఎంఎల్ఎలపై అనర్హత వేటు వేయాలనే వ్యాజ్యాలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అసెంబ్లీ కార్యదర్శి వీ.నర్సింహాచార్యులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ జరిపి శుక్రవారం తీర్పు వెలువరించింది.

అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు ప్రకటించింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సిజె ధర్మాసనం సూచించింది. స్పీకర్‌కు ఎలాంటి టైం బాండ్ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. రీజనబుల్ టైంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 10వ షెడ్యూల్, అసెంబ్లీ ఐదేళ్ల గడువును దృష్టిలో ఉంచుకుని స్పీకర్ తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.

# వయనాడ్‌లో బీజేపీకి షాక్.. దూసుకుపోతున్న ప్రియాంక గాంధీ

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాజీనామాతో ఖాళీ అయిన కేరళలోని వాయనాడ్ లోక్ సభ స్థానానికి ఉప ఎన్నిక పోలింగ్ జరిగింది. ఈరోజు ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. తొలి ట్రెండ్స్‌లో ప్రియాంక గాంధీ ముందంజలో ఉన్నారు. బీజేపీ వెనుకబడింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ వరుసగా రెండోసారి ఈ సీటును గెలుచుకుని పార్లమెంటుకు చేరుకున్నారు. ఆయన లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు చెందిన సీపీఐ(ఎం) అభ్యర్థి అన్నీ రాజాపై 3 లక్షల 64 వేలకు పైగా ఓట్లతో విజయం సాధించారు. రాహుల్ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ స్థానం నుండి తన సభ్యత్వాన్ని నిలుపుకుంటూ వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. అందుకే అతని సోదరి ప్రియాంక గాంధీ ఇక్కడ జరుగుతున్న ఉపఎన్నికలో మొదటిసారి పోటీ చేస్తున్నారు.గత ఎన్నికల్లో వాయనాడ్ లోక్‌సభ స్థానంలో 73.57 శాతం ఓటింగ్ జరిగింది. ఆ సమయంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీకి మొత్తం 6,47,445 ఓట్లు వచ్చాయి. కాగా ఆయన సమీప ప్రత్యర్థి అన్నీ రాజా కేవలం 2,83,023 ఓట్లకే పరిమితమయ్యారు. అదేవిధంగా మూడో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి కే సురేంద్రన్‌కు కేవలం 1,41,045 ఓట్లు మాత్రమే వచ్చాయి.ఈసారి యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడిఎఫ్) అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఉన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా-మార్క్సిస్ట్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ నుండి సత్యన్ మొకేరి బరిలోకి దిగారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి నుంచి నవ్య హరిదాస్ కూడా పోటీ చేస్తున్నారు. ఈ ఉప ఎన్నికల్లో మొత్తం 16 మంది అభ్యర్థులు పోటి చేశారు. కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానం దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఉన్నతమైన స్థానం. 2019లో అమేథీలో ఓడిపోయిన రాహుల్ గాంధీ ఇక్కడి నుంచి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచి పార్లమెంటుకు చేరుకున్నారు. 2024లో కూడా ఆయన ఈ స్థానం నుంచి గెలుస్తారు. కర్నాటక, తమిళనాడు సరిహద్దులో ఉన్న కేరళలోని వయనాడ్ సీటుకు రాజకీయ ప్రాధాన్యత మాత్రమే కాదు, దాని సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయం కూడా చాలా గొప్పది. వల్లీయూర్ కేవు భగవతి ఆలయం ఇతర ముఖ్యమైన మతపరమైన ప్రదేశాలు గొప్ప మతపరమైన ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధికంగా షెడ్యూల్డ్ తెగల జనాభా ఉంది. నల్ల మిరియాలు, కాఫీ ఇక్కడ అధికంగా పండిస్తారు. నిజానికి దీని వల్లే వాయనాడ్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఈ స్థానంలో పోటీ చేసి మొత్తం 7,06,367 ఓట్లను సాధించారు. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం రాహుల్ గాంధీకి మొత్తం 64.94 శాతం ఓట్లు వచ్చాయి. ఆ సమయంలో రెండో స్థానంలో ఉన్న సీపీఐ (మార్క్సిస్టు)కి చెందిన పీపీ సునీర్‌కు కేవలం 2,74,597 ఓట్లు మాత్రమే వచ్చాయి. దివంగత కాంగ్రెస్ నేత ఎంఐ షానవాస్ 2009, 2014లో ఈ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2018లో దురదృష్టవశాత్తు మరణించిన తర్వాత రాహుల్ గాంధీ 2019 ఎన్నికల్లో ఈ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు.

# శీతాకాలం ఉత్సాహంగా తిందాం!

నిరుత్సాహపరిచే శీతగాలుల్లో ఉత్సాహంగా ఉండేందుకు కొన్ని ఎంపిక చేసిన ఆహారాలను తప్పక తీసుకోవాలి. చలికాలంలో ఉండే బద్ధకాన్ని వదిలించుకునేందుకు, చల్లటి వాతావరణంలో కలిగే జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండేందుకు మీ డైట్‌లో ఈ మెనూ ఉండేలా చూసుకోండి.

చేప కొవ్వు

కొవ్వు అధికంగా ఉండే చేపలను వారానికి ఒకసారి తప్పకుండా తినండి. వీటిలో ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఇవి మానసిక ఒత్తిడి, ఆందోళన వల్ల కలిగే అసౌకర్యాన్ని తగ్గిస్తాయి. ఒమెగా3 ఫ్యాటీ ఆమ్లాలు మెదడు చురుకుదనాన్ని ప్రభావితం చేసే న్యూరోట్రాన్స్‌మీటర్స్ పనితీరుని మెరుగుపరుస్తాయి. కాబట్టి బద్ధకంగా, నిరుత్సాహంగా ఉండేవాళ్లు కనీసం వారానికి మూడు సార్లు చేపల కూర తింటే మంచిది.

ఆకు కూరలు

ఆకుకూరల్లో ఉండే విటమిన్ బీ-9 (ఫోలేట్) మెదడులో సంతోషాన్ని కలిగించే సెరటోనిన్‌ని ప్రభావితం చేస్తుంది. పాలకూర, కాలే (లీఫ్ క్యాబేజ్)లతోపాటు మిగతా ఆకుకూరలు కూడా తినొచ్చు. ఆకుకూరల్లో యాంటి ఆక్సిడెంట్లు కూడా అధికంగా ఉంటాయి. కాబట్టి అన్ని రకాల ఆకు కూరలూ తీసుకునే ప్రయత్నం చేయాలి. అస్తమా, జలుబు, దగ్గు, గొంతునొప్పి తరచుగా బాధిస్తుంటే ప్రతి రోజూ ఏదో ఒక పూట ఆకుకూర ఉండేలా చూసుకోవాలి.

మేలుచేసే బ్యాక్టీరియా

జీర్ణ వ్యవస్థ మెరుగ్గా పని చేయడం వల్ల సాధారణ అలర్జీలు దరిచేరవు. అంతేకాదు శీతాకాలంలో వచ్చే అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు వ్యాధినిరోధ శక్తిని పెంపొందించుకోవాలి. ఇందుకోసం జీర్ణవ్యవస్థలో మేలుచేసే బ్యాక్టీరియా ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. మజ్జిగ, పెరుగు, యోగర్ట్ తీసుకుంటే మంచిది.



పుల్లని పండ్లే మేలు

పండ్లు తింటే ఆరోగ్య మెరుగవుతుందనే అవగాహన అందరికీ ఉంది. అలాగే శీతాకాలంలో పుల్లని పండ్లు తింటే అలర్జీ (జలుబు, తుమ్ములు) వస్తుందనే అపోహ కూడా ఉంది. ఆ అలర్జీలను తగ్గించే, వ్యాధినిరోధకతను పెంచడంలో పుల్లని పండ్లకు మరేవీ సాటిరావు. పుల్లని ఫలరసాల్లో విటమిన్-సి అధికంగా ఉంటుంది. బత్తాయి, నారింజ ఫల రసాలను తరచుగా తాగుతూ ఉంటే శీతాకాలంలో బలుబు సమస్య రాదు.

దుంపలు మరువొద్దు

ఎక్కడికి పోయినా మన మూలాలు మరచిపోవద్దని చెబుతారు. ఆరోగ్య విషయంలోనూ అంతే. దుంప(వేర్లు)ల్లో కార్బోహైడ్రేట్‌లు పుష్కలంగా ఉంటాయి. పిండి పదార్థాలతోపాటు ఫైబర్ కూడా వీటిలో ఉంటుంది. క్యారెట్, బీట్‌రూట్, ఆలుగడ్డలు, చామగడ్డలు వంటి దుంపకూరల్ని తప్పక తినాలి.

హెర్బల్ టీ

శీతాకాలంలో వేడివేడి టీలు ఎక్కువగా తాగుతారు. పాలతో చేసిన టీ, కాఫీల కంటే హెర్బల్ టీలు తాగితే ఎక్కువ మేలు జరుగుతుంది. లెమన్ టీ, చామంతితో చేసిన టీ తాగితే ఆందోళన వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి. హెర్బల్ టీ తాగితే నాడీ వ్యవస్థ మెరుగవుతుంది. గురక సమస్య కూడా తగ్గుతుంది.

# రూ .5,260 కోట్ల పెట్టుబడులు

స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్‌లను, హెటిరో ల్యాబ్స్ ఫినిషిడ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమలను నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఈ ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ డైరెక్టర్ సతీష్ రెడ్డి, లారస్ ల్యాబ్స్ ఈడీ వివి రవికుమార్, గ్లాండ్ ఫార్మా సీఈఓ శ్రీనివాస్, ఎంఎస్ ల్యాబ్స్ సిఎండి ఎంఎస్ఎన్ రెడ్డి, అరబిందో డైరెక్టర్ మదన్మోహన్ రెడ్డి, హెటిరో గ్రూప్ ఎండి బి.వంశీకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రాహుల్‌కు తెలియకుండానే జరిగాయా?

**హైదరాబాద్ :** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఒకలా, గల్లీలో మరోలా మాట్లాడున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలంతా రెండు నాలుకల ధోరణితో ఉన్నారని మండిపడ్డారు. అదానీ అంశం కారణంగా భారతదేశ ప్రతిష్ట అంతర్జాతీయంగా మసకబారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బిఆర్ఎస్ ఎంఎల్ఎలు జగదీశ్‌రెడ్డి, కె.పి.వివేకానంద తదితరులతో కెటిఆర్ మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. అదానీ బండారం మళ్లీ అంతర్జాతీయంగా బయటపడిందని, అమెరికా నుంచి ఆఫ్రికా సహా దేశంలో ఆయన వ్యవహారంపై ప్రకంపనలు మొదలయ్యాయని పేర్కొన్నారు. అదానీ కంపెనీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు రెండుసార్లు బయటపడిందని చెప్పారు. అమెరికాలో ఓ కోర్టు అదానీ సంస్థ లంచాలు ఇచ్చినట్లు తీర్పు చెప్పిందని,గతంలో హిండెన్‌బర్గ్ అనే సంస్థ కూడా అవకతవకలు జరిగినట్లు చెప్పిందని అన్నారు.

**ఆదానీ ఎన్నిసార్లు ప్రయత్నించినా మేము ఆయనను రానివ్వలేదు**

తమ పార్టీ పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు అదానీ ఎన్నిసార్లు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ప్రయత్నించినా తాము ఆయనను రానివ్వలేదని కెటిఆర్ తెలిపారు. అదానీ తమను కలిసి వ్యాపారం చేస్తామని అడిగారని, కానీ తాము ఆయన ప్రతిపాదనలను మర్యాదపూర్వకంగా తిరస్కరించి పంపించేశామని అన్నారు. అదానీతో తాము ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని స్పష్టం చేశారు. ఆదానీ విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని విమర్శించారు. రాహుల్ గాంధీ అవినీతి పరుడు అన్న వ్యక్తికే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్రతివాచీలు పరిచిందని, అదే కాంగ్రెస్‌కు తమకు ఉన్న తేడా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి తెలియకుండా రేవంత్‌రెడ్డి ఆదానీకి రెడ్‌కార్పెట్ పరిచారా..? అని ప్రశ్నించారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అదానీ సంస్థలతో రూ.12,400 కోట్లు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఘనంగా చెప్పారని, 5000 కోట్లు గ్రీన్ ఎనర్జీ, 5000 కోట్లు డేటా సెంటర్, సిమెంట్ పరిశ్రమ పెట్టుబడులు.. ఇలా మొత్తం రూ.12,400 కోట్ల పెట్టుబడులు చేసుకున్నామని చెప్పారు. తెలంగాణ డిస్కంలను అదానీకి అప్పగించేందుకు ఓల్డ్ సిటీ బిల్లుల వసూళ్ల డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. అదానీకి డిస్కంలను అప్పగించి వాటిని ప్రైవేటీకరించేందుకు కుట్ర చేశారని మండిపడ్డారు. యాదాద్రిలోని రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ వద్దని ప్రజలు వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ పట్టించుకోలేదని, ఏ మూసీ శుద్ధి అంటున్నారో అదే మూసీ సిమెంట్ ఫ్యాక్టరీ కారణంగా మురికి మయం అవుతుందని చెప్పినా పట్టించుకోలేదని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసినట్లుగా మమ అనిపించి అదానీకి సహకరించే పని చేశారని విమర్శించారు. పైన బడే భాయ్ ఆదేశించటంతో..కింద చోటా భాయ్ ఆచరించాడని కెటిఆర్ ధ్వజమెత్తారు.

**అదానీతో రేవంత్ రెడ్డి దందాను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా..?**

తెలంగాణలో అదానీతో రేవంత్ రెడ్డి దందాను రాహుల్ గాంధీ సమర్థిస్తున్నారా..? అని కెటిఆర్ ప్రశ్నించారు. ప్రతి రోజు అదానీని విమర్శించే రాహుల్ గాంధీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలకు మద్దతిస్తున్నారా..? చెప్పాలని డిమాండ్ చేశారు.పారిశ్రామికవేత్తలు ఎవరూ ఊరికే విరాళాలు ఇవ్వరని మహారాష్ట్ర ఎన్నికల సభల్లో రాహుల్ గాంధీ చెప్పారని, నీకిది, నాకది అని ఏదో పెద్దదే ఆశించి ఇస్తారని అన్నారని పేర్కొన్నారు. విద్యుత్‌కు సంబంధించి ప్రాజెక్టులు ఆదానీకి అప్పగించేందుకు సిఎం ప్రయత్నించారని, దీంతో అదానీ గుండె ఉప్పొంగిపోయి స్కిల్ యూనివర్సిటీకి రూ.100 కోట్ల విరాళం ఇచ్చారని పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి ఇంట్లో నాలుగు గంటల పాటు అదానీ సమావేశమయ్యారని, అదానీ వ్యాపార విస్తరణ తెలంగాణలో ఇంత జరుగుతుంటే కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియదా..? అని అడిగారు. చిన్న కార్పొరేషన్ పదవికి కూడా కాంగ్రెస్‌లో హైకమాండ్ అనుమతి కావాలని, మంత్రి వర్గ విస్తరణకు కూడా ఇప్పటివరకు హైకమాండ్ పర్మిషన్ ఇవ్వలేదని విమర్శించారు. అలాంటప్పుడు అదానీతో ఒప్పందాలకు కాంగ్రెస్ హైకమాండ్ పర్మిషన్ లేదని భావించాలా..? అని ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.100 కోట్లు అదానీ నుంచి విరాళం తీసుకుందని, రాహుల్ గాంధీకి తెలిసి తీసుకున్నారా..? లేక తెలియకుండా తీసుకున్నారా..? అని నిలదీశారు.

**కాంగ్రెస్ పార్టీది గల్లీలో ఒక నీతి.. ఢిల్లీలో మరో నీతి**

కాంగ్రెస్ జాతీయ పార్టీ అని, దానికి దేశవ్యాప్తంగా ఒక్కటే విధానం ఉండాలని కెటిఆర్ వ్యాఖ్యానించారు. కానీ ఢిల్లీలో అదానీ మంచివాడు కాదు.. గల్లీలో మాత్రం అదానీ మంచోడు అని కాంగ్రెస్ పార్టీ అంటోందని, కాంగ్రెస్ పార్టీది గల్లీలో ఒక నీతి.. ఢిల్లీలో మరో నీతి..? అని దుయ్యబట్టారు. బిజెపిది డబుల్ ఇంజిన్ అంటున్నారని, మరి కాంగ్రెస్‌ది డబుల్ స్టాండర్డ్ కాదా..? అని ప్రశ్నించారు.ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను కెన్యా ప్రభుత్వం రద్దు చేసిందని, తెలంగాణ ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకోవడం లేదని అన్నారు. రాహుల్‌గాంధీకి చిత్తశుద్ధి ఉంటే తెలంగాణ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీకి విరాళం సరియైనదేనని రాహుల్ గాంధీ భావిస్తున్నారా..? అని అడిగారు.

అదానీ అవినీతి పరుడని రాహుల్ గాంధీ అంటుంటారని, అలాంటి వ్యక్తితో వ్యాపారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇదంతా రాహుల్ గాంధీకి తెలిసే జరుగుతుందని భావిస్తున్నామన్నారు. స్కిల్ యూనివర్సిటీకి ఇచ్చిన రూ.100 కోట్లు వెనక్కి ఇవ్వాలని అన్నారు. రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రజాభిప్రాయ సేకరణకు ప్రజలు వ్యతిరేకిస్తుంటే కాంగ్రెస్,బిజెపి ఎందుకు నోరు విప్పడం లేదని అడిగారు. దేశం ప్రతిష్ట మంటగలిసిపోతే బిజెపి ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ మాత్రమే నిజమైన పోరాటం చేస్తోందని స్పష్టం చేవారు. అదానీ వ్యవహారంపై ప్రధాని మోడీ, రాహుల్ గాంధీ వెంటనే స్పందించాలని కెటిఆర్ డిమాండ్ చఓశారు.

**స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం**

ఫిరాయింపు ఎంఎల్ఎల అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని కెటిఆర్ వెల్లడించారు. అనర్హత పిటిషన్ల విషయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ తీర్పుపై ఆయన స్పందించారు. మొన్నటి వరకు స్పీకర్‌ను అనర్హతపై ఆదేశించే అధికారం కోర్టుకు లేదని వాదించారని గుర్తు చేశారు. రీజనబుల్ పీరియడ్‌లో నిర్ణయం తీసుకోవాలని సిజె స్పష్టం చేశారని, రీజనబుల్ పీరియడ్ అంటే మూడు నెలలు అని మణిపూర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఉందని పేర్కొన్నారు.

# కళ్ల కింద ఏర్పడే డార్క్ సర్కిల్స్‌ను తగ్గించే అద్భుతమైన ఆయుర్వేద చిట్కా..!

ప్రస్తుత తరుణంలో చాలా మందికి డార్క్ సర్కిల్స్ అనేవి ఏర్పడుతున్నాయి. స్త్రీలే కాదు పురుషులు కూడా ఈ సమస్య బారిన పడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. అయితే ఆఫీసుల్లో పని ఒత్తిడి అధికంగా ఉండడంతోపాటు రాత్రి సరిగ్గా నిద్రలేకపోవడం.. ఈ రెండింటినీ డార్క్ సర్కిల్స్ వచ్చేందుకు ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. అయితే కళ్ల కింద నల్లని వలయాలు వస్తే చాలా మంది అనేక రకాల మార్గాలను ఇప్పటికే అనుసరించి ఉంటారు. ఖరీదైన చికిత్సలను కూడా ప్రయోగించి ఉంటారు. కానీ ఏవి వాడినా ఉపయోగం లేనట్టయితే ఇప్పుడు మేం చెప్పబోయే ఓ చిట్కాను పాటించండి. దీంతో కళ్ల కింద ఏర్పడే నల్లని వలయాలను తగ్గించుకోవచ్చు.

రెండే రెండు పదార్థాలు చాలు..కేవలం రెండే రెండు పదార్థాలను ఉపయోగించి మీరు ఒక పేస్ట్‌ను తయారు చేయాల్సి ఉంటుంది. దీన్ని కళ్ల కింద అప్లై చేస్తే చాలు వారం రోజుల్లోనే కచ్చితంగా మీకు తేడా కనిపిస్తుంది. ఇక ఈ చిట్కాలో వాడే పదార్థాలు రెండు కూడా సహజసిద్ధమైనవే. అందువల్ల మీకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ భయం కూడా లేదు. ఇక ఈ చిట్కాకు ఏమేం పదార్థాలు కావాలో, దీన్ని ఎలా ఉపయోగించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

జాజికాయ..కళ్ల కింద నల్లని వలయాలను తగ్గించుకోవడం కోసం మీకు కేవలం రెండే రెండు పదార్థాలు అవసరం అవుతాయి. ఒకటి జాజికాయ, రెండు ఆముదం. ఎన్నో వేల ఏళ్ల నుంచే జాజికాయను ఆయుర్వేదంలో ఎంతో ముఖ్యంగా ఉపయోగిస్తున్నారు. జాజికాయలను ఆరోగ్యం కోసమే కాకుండా అందం కోసం కూడా ఆయుర్వేదంలో ఉపయోగిస్తున్నారు. జాజికాయల్లో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. జాజికాయల్లో టానిన్స్ ఉంటాయి.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ




**ములుగు ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :** రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ సూచనల మేరకు మంగపేట మండల కేంద్రం లో వివిధ గ్రామాలకు చెందీన లబ్దిదారులకు సీఎం ఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులు ఆక ఉషారాణి వెఫ్ ఆఫ్ రఘు 35 వేల రూపాయలు పెద్దపల్లి రోజ సన్ ఆఫ్ ప్రవీణ్ కుమార్ 25 వేల రూపాయలు జక్కం విజయలక్ష్మి వెఫ్ ఆఫ్ బుచ్చయ్య గ్రామం బోర్ నర్సాపూర్ 20వేల రూపాయలు, గంగెర్ల సమ్మయ్య సన్ఆఫ్ మాణిక్యం 60 వేల రూపాయలు, రామక్రిష్ణ సన్ ఆఫ్ వెంకట రామ్ నర్సయ్య కమలాపురం 39 వేల రూపాయలు మైప ఉమారాణి వైఫ్ ఆఫ్ రవీందర్ తిమ్మంపేట తిమ్మంపేట 37వేల రూపాయలు, రమ సారయ్య గ్రామం కమలాపురం 49 వేల 5 వందలు రూపాయలు, రమ గ్రామం కమలాపురం 42 వేల 5 వందలు లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య,జిల్లా సెక్రటరీ తుడి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు ముత్తి నేని ఆదినారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు చాద మల్లయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు టీవీ హైదయ్ తుల్లా, గ్రామ కమిటీ అధ్యక్షులు సదయ్ హుసేన్,మండల సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బడిశా ఆదినారాయణ,గంగినేని శేషగిరి, గంగెర్ల నాగరాజు,మూర్తి, గాదె సమ్మయ్య, తదితరులు పాల్గొన్నరు.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వ్రాయొద్దు

**- లేదంటే ఇబ్బందులు తప్పవు**

**- యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ కు బెదిరింపు లేఖ**



**నారాయణ పేట ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :**రేవంతన్నా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వ్రాస్తే కొడంగల్ మీడియా కు ఇబ్బందులు తప్పవు, ఇందుకు మీరే బాద్యులు. పార్మా కంపెనీ వీడియోలు మీకు అవస రమా... అంటూ ఓ అజ్ఞాత వ్యక్తి నారాయణ పేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం నకు చెందిన ఓ యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్ బెదిరింపు లేఖ వ్రాసారు, గురువారం ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలగు లోకి వచ్చింది,కోస్గి రిపోర్ట్ గా వున్న సదరు వ్యక్తి పట్టణంలోని ఓ హెూటల్ దగ్గర తన ద్విచక్ర వాహనం పార్కు చేసి నిలిపిన సమయంలో ఎవరో ఒక వ్యక్తి బైక్ ట్యాంక్ కవర్ లో ఈ లేఖ ను పెట్టి వెళ్లారు,సదరు వ్యక్తి బైక్ ట్యాంక్ కవర్ తెరచి చూడగా అందులో ఈ లేఖ కనిపించింది.

## జిల్లా కలెక్టర్ ను కలిసిన ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు



**ములుగు ప్రతినిధి ( మన వెలుగు) నవంబర్ 22 :** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కలిసి వినతి పత్రం అందించిన ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు. ఈ సందర్భం గా ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడు బానోత్ వెంకన్న మాట్లాడుతూ.. జిల్లా అక్రిడేషన్ కమిటీలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం డిసెంబర్ నెలలో గిరిజన జర్నలిస్టులకు నిర్వహించబోతున్న శిక్షణ తరగతులలో వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ అవకాశం కల్పించాలని కలెక్టర్ ను కోరిన ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు. ఈ కార్యక్రమంలో , గౌరవ అధ్యక్షులు భూక్యా సునీల్, కార్యదర్శి ముకులోత్ శరత్, వర్కింగ్ ప్రెసిడెంట్ నేనావత్ సుధాకర్, ఉపాధ్యక్షుడు పోరికసునీల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై ఉన్న ఏడాకుల చెట్లను తొలగించండి

## మున్సిపల్ కమిషనర్ కు వినతి



**జగిత్యాల బ్యూరో ( మన వెలుగు ) నవంబర్ 22 :**రోడ్లపై ఉన్న ఏడాకుల చెట్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ 35వ వార్డు కౌన్సిలర్ హన్మాండ్ల జయశ్రీ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జగిత్యాల పట్టణంలో హరిత హరం కార్యక్రమంలో భాగం గా మున్సిపాలిటీ వారు గత పది సంవత్సరాల క్రితం ఏడాకుల చెట్లను వందల సంఖ్యలో నాటడం జరిగింది. ఈ చెట్టునీ దయ్యం చెట్టుగా పిలుస్తారు. ఏడాకుల చెట్లు పూతకు వచ్చి ప్రజలు ఆ వాసన వల్ల అనారోగ్యాలు ఎదుర్కొంటున్నారు. ఈ చెట్టు మరియు పూవు పుప్పొడి వాసన వల్ల శ్వాసకోస వ్యాదులు, అస్తమా రోగులకు చాలా డేంజర్ అని గతంలోనే ప్రభుత్వాలు ప్రకటించడం జరిగింది కొన్ని రాష్ట్రాలలో అన్ని చెట్లను తొలగించడం ద్వారా శాశ్వత పరిష్కారం చేసారు. కాని, మన తెలంగాణ ప్రభుత్వం వారు తొలగించక పోవడం వల్ల జగిత్యాల పట్టణ ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. దీని వల్ల అనారోగ్య సమస్యలు ఏర్పడుతాయని శాస్త్రీయంగా నిరూపించబ డింది.జగిత్యాల పట్టణ ప్రజలు వాకింగ్ కొరకు దరూర్ క్యాంప్,బైపాస్ రోడ్డు, కృష్ణ నగర్ మరియు ధర్మపురి రోడ్డు లలో ఈ ఏడు ఆకుల చెట్లు విపరీతంగా పెరిగి పూతకు వచ్చి ఒక రకమైన వాసన రావడం అక్కడ నడవలేని పరిస్థితులు ఉన్నాయి. కావున వెంటనే యుద్ధ ప్రాతిపది కగా తీసుకోని జగిత్యాల పట్టణంలో ఉన్న ప్రతి ఒక్క ఏడాకుల చెట్టును తొలగించి ప్రజల ఆరోగ్య సమస్యలకు పరిష్కారించాలని 35వ వార్డు కౌన్సిలర్ హన్మాండ్ల జయశ్రీ కోరారు.

# ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరం






**- గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు**

**- ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా వైద్య కళాశాలకు ౦ంచి పేరు తీసుకురావాలి**

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**జగిత్యాల బ్యూరో ( మన వెలుగు ) నవంబర్ 22 :**జగిత్యాల పట్టణ లో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ,ఈవ్ టీజింగ్,ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై విద్యార్థిని విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...విద్యార్థిని, విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకరావలన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలని,కలశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపినారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామ ని,తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం,వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదు అని తెలిపినారు.విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యన భ్యసించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చేయడం నేరమని,ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్ప డితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని హెచ్చరించారు.ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియజేసి సమాచారం అందించా లన్నారు.గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలాంటి వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు మీ పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ముఖ్యంగా విద్యార్థినిలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవా లని,నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నాప్పుడే మరింత భద్రత కల్పించగలువుతా మని,మహిళలు,విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ కు పిర్యాదు చేసినచో చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగు తుందని అన్నారు.పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సైబర్ మోసాలు ఎక్కువ అయ్యాయని వీటిపై ప్రతి ఒక్క విద్యార్థికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో డిఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణు గోపాల్, ప్రిన్సిపాల్ సయ్యద్ సైఫుల్లా ఖాద్రి కళాశాల విద్యార్థిలు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ చేస్తే క్రిమినల్ కేసులు



**కుత్బుల్లాపూర్ ( మన వెలుగు ) నవంబర్ 22 :**ర్యాగింగ్‌తో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠినమైన శిక్షలు ఉంటాయని బాలానగర్ ఏసీపీ హనుమంత్ రావు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ భాగ్యారధి డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ హను మంత్ రావు మాట్లాడుతూ..ర్యాగింగ్ చట్ట రీత్యా నేరం. ర్యాగింగ్‌లో పాల్గొనే విద్యార్థులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.అదే విధంగా ర్యాగింగ్ తాలూకు నైతిక మరియు చట్టపరమైన ప్రభావాలపై విద్యార్థులకు వివరించి, మంచి విలువలను అలవరుచుకోవాలని సూచించారు.డిగ్రీ కళా శాల విద్యార్థులు పాల్గొని, ర్యాగింగ్‌కు దూరంగా ఉంటామ ని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ కనకయ్య ,ఎస్ఐ నాయుడు,ఎస్ఐ హరీష్,ఎస్ఐ సత్యనారాయణ,డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్, డైరెక్టర్ గోవిందా రెడ్డి,డైరెక్టర్ వెంకట్ రెడ్డి, డైరెక్టర్ రామకృష్ణ, డైరెక్టర్ రమేష్ బాబు మరియు కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టు మద్దయ్య పై దాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



**కుత్బుల్లాపూర్ ( మన వెలుగు ) నవంబర్ 22 :**డిసిపి, ఎసిపి లను ఆదేశించిన రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రభుత్వ భూ అక్రమణల పై వార్త కధనాలు రాసిన సినియర్ జర్నలిస్టు మద్దయ్య పై దాడి చెసిన నిందితుల పై కఠిన చర్యలు తీసుకొవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిసిపి, ఎసిపి లను ఆదేశించారు.జర్నలిస్టు మద్దయ్య పై జరిగిన దాడి విషయం దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్,దాడికి గురైన జర్నలిస్టు మద్దయ్య, మాలమహ నాడు సెక్రటరీ జనరల్ బొల్లమల్ల నర్సింగ్ రావు లు డిల్లీ పర్యటనలో వున్న రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కు పొన్ లో వివరించారు. వెంటనే స్పందిం చిన చైర్మన్ బక్కి వెంకటయ్య పేట్ బషిరాబాద్ డిసిపి కోటిరెడ్డి, మేడ్చల్ ఎసిపి లకు పొన్ చెసి సంఘటన పై ఆరా తీసి నిందితుల పై బిఎన్. ఎస్,ఎస్సీ, ఎస్టీ అత్యాచా రాల చట్టం కింద కేసు నమోదు చెసినందున విచారణను త్వరగా పూర్తి చెసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. వెంటనె స్పందించి న చైర్మన్ కు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, మాల మహానాడు స్టేట్ సెక్రటరీ జనరల్ బొల్ల మల్ల నర్సింగ్ రావు, జర్నలిస్టు మద్దయ్య లు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ..సైబారబాద్ కమిషన రేట్ పరిధిలో ని దుండిగల్ పోలీస్ స్టేషను పరిధిలో ప్రభుత్వ భూములను, చెరువును అక్రమించి వెంచర్ చెస్తున్న త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ అక్రమాలు భూ కబ్జాల పై వార్తలు రాసిన జర్నలిస్టు మద్దయ్య పై పధకం ప్రకారం సాముహిక దాడిచేసిన దుండగులైన సుధాకర్ తదితరులను తక్షణమె అరెస్టు చేయాలన్నారు. బాచుపల్లి మండలం బౌరం పేటలో ని డిపి పల్లి లోని సర్వే నెంబర్181,282,184,187,188,199 లో ఎఫ్.టిఎల్ భూమిని అక్రమించి వెంచర్ నిర్మాణం చెస్తున్నారన్నా రన్నారు.ఈ భూ అక్రమాల పై వరుస కథనాల రాయడం తో స్పందించిన తహసీల్దారు, నీటి పారుదల శాఖ అధికారుల విచారణకు వెళ్ళిన సమయంలో వార్త సేకరణకు ఇతర జర్నలిస్టు లతో కలిసి వెళ్ళిన జర్నలిస్టు మద్దయ్య పై ఒక్కసారిగా త్రిపుర ల్యాండ్ మార్క్ నిర్మాణ సంస్థ యండి సుధాకర్ అదేశాలతో పది మంది దుండ గులు బాల్ రెడ్డి,భూపాల్ రెడ్డి,ప్రశాంత్ రెడ్డి, చిన్నారెడ్డి, వెంకట్ తదితర దుండగుల ముఠా సాముహిక దాడి చెసి గాయపర్చారన్నారు. నిందితుల పై దుండిగల్ పోలీసులు బిఎన్ ఎస్ ,ఎస్సీ,ఎస్టి అత్యచారాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చెసినందున పోలీసులు విచారణ పూర్తి చెసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములు చెరువులను అక్రమణల పై రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా కొరడ జులిపిస్తున్న నేపధ్యంలో ప్రజా శ్రేయస్సు ప్రభుత్వ భూములను కాపాడెందుక వార్తలు రాసిన జర్నలిస్టు మద్దయ్యకు రక్షణ కల్పించా లన్నారు.

# ప్రజల అభిమానంతోనే సేవ చేసే భాగ్యం

## - ఎమ్మెల్యే పాయలశంకర్

**అదిలాబాద్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :**నియోజకవర్గ ప్రజల అభిమానంతోనే సేవ చేసే భాగ్యం కలిగిందని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల వసతి గృహాల్లో విద్యార్థులు పడే ఇబ్బందులను చూసి శాసనసభలో ప్రతిపక్ష నాయకునిగా మాట్లాడే అవకాశం రావడంతో హాస్టల్ విద్యార్థుల కష్టాలను మెస్ చార్జీల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు దీనికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి బీసీ శాఖ మంత్రి కమిటీలు చర్చించి మెస్ చార్జీల పెంపునకు ఆమోదం తెలపడంతో రాష్ట్ర మొత్తంలో వసతి గృహాల్లో ఉండే 8 లక్షల మంది విద్యార్థులకు మేలు జరిగిందని ఆయన అన్నారు వసతి గృహాలపై నమ్మకంతో అనేక మంది పేదలు తమ పిల్లల్ని మీ చేతిలో పెడతారని మీ పిల్లలాగే వసతి గృహాల్లో ఉండే పిల్లలకు పట్ల శ్రద్ధ పెట్టాలని ఆయన అన్నారు వారు ఉన్నతికి బాటలు వేయాలని ఆయన కోరారు తాను సభ దృష్టికి తీసుకెళ్లిన సమస్య పరిష్కారమై ఎంతో మంది పేదలకు మేలు జరగడం తనకెంతో సంతృప్తినిచ్చిందని ఇంతకంటే నాయకులకు కావాల్సిందేముందని ఆయన అన్నారు రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలను ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఆయన అన్నారు అధికార ప్రభుత్వం సైతం స్పందించి మెస్ ఛార్జీలు పెంచడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు తినిపించి వారితో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది బీజేపీ నాయకులు అశోక్ రెడ్డి. ముకుంద్. దయాకర్. తదితరులు పాల్గొన్నారు.



# భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం



### మోహన్ సింగ్ హైదరాబాద్ పర్యటన పోస్టర్ ఆవిష్కరించిన జర్నలిస్టులు

**కుత్బుల్లాపూర్ ( మన వెలుగు ) నవంబర్ 22 :** అంకితభావం, ధైర్యంతో భారత యువతకు మార్గదర్శకుడిగా నిలిచి, భారత స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన షహీద్ భగత్ సింగ్ విప్లవకర జీవితం దేశ యువతకు స్ఫూర్తిదాయకం అని సినియర్ జర్నలిస్ట్, కవి మోహన్ బైరాగి అన్నారు.నవంబర్ 26,27తేదీలలో హైదరాబాద్ లో పలు కార్యక్రమాలలో పాల్గొననున్న భగత్ సింగ్ మేనల్లుడు, ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్ పర్యటన కు సంబంధించిన గోడ పత్రికను పీపుల్స్ న్యూస్ ప్రధాన కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టులతో కలిసి ఆవిష్క రించారు.కేవలం 23 ఏళ్ల వయసులోనే దేశం కోసం తన జీవితాన్ని అర్పించాడాని,చిన్న వయసులోనే ప్రజా స్వామ్యం, సమానత్వం, స్వేచ్ఛ వంటి విలువలపై ఆసక్తి కనబరిచి విప్లవ మార్గం ఎంచుకొని, బ్రిటిష్ పాలనను ఎదిరించిన భగత్ సింగ్ తన ఆలోచనలతో భారత యువతకు ఆదర్శ%శీ%గా నిలిచాడని మోహన్ బైరాగి తెలిపారు.ప్రొఫెసర్ జగ్ మోహన్ సింగ్ హైద్రాబాద్ పర్యటన ను విజయవంతం చేయాలని విద్యార్థులకు, యువతకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శేషారెడ్డి,శ్రవణ్, బాలరాజ్, సాయి, గోపాల్ రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర సంఘవిద్రోహశక్తుల ఏర్పాటును విచ్ఛిన్నం చేసిన జిల్లా పోలీసులు








**- ప్రతీకార హత్య కు పన్నిన కుట్ర సైతం భగ్నం**

**- మారణ ఆయుధాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు**

**నలుగురు నిందితులు అరెస్ట్**

**- నాలుగు పిస్టల్స్, 8 మ్యాగజిన్స్,18 లైవ్ రౌండ్స్, 6 సెల్ ఫోన్లు స్వాధీనం**

**- 9 మంది పై కేసు నమోదు**

**-మిగిలిన నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు**

**-వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ గౌష్ ఆలం**

**ఆదిలాబాద్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి కర్నూలు జిల్లా నందు ప్రభుత్వ నిషేధిత జనశక్తి దళ ఏర్పాటుకై నిందితులు ఆర్థికంగా మరియు ఆయుధపరంగా దళం పునర్నిర్మాణం చేస్తుండగా ఆదిలాబాద్ జిల్లా పోలీసులు పక్క సమాచా రంతో వారిని పట్టుకుని వారి ఆలోచనలను ఏర్పాటను విచ్ఛిన్నం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఏర్పాటుచేసిన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం వివరాలను వెల్లడిం చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఏ1 వెంకటరెడ్డి ముఖ్యంగా గతంలో జనశక్తి పార్టీలో పనిచేసి అరెస్టు అవడం జరిగింది. సూర్యాపేట జిల్లా తన మిత్రుడి హత్య కేసుకు ప్రతీకార చర్యగా, అదేవిధంగా జనశక్తి పార్టీని తిరిగి ఉమ్మడి కర్నూలు జిల్లా నందు స్థాపితం చేయడానికి నల్లగంటి ప్రసన్నరాజు ఆర్థిక సహాయం చేయగా ఏ1 వెంకటరెడ్డి మరియు తన అనుచరుడు ఏ3 హేమ కాంత్ రెడ్డి కలిసి ఏ2 దిలీప్ మరియు అతని రెస్టారెంట్ లో పనిచేసే భైరవ్ చెప్పిన వ్యక్తితో కలిసి కాశీకి వెళ్లి ఉండగా, వారితో వచ్చిన వ్యక్తి బీహార్ రాష్ట్రం మ్యుంగార్ రైల్వే స్టేషన్ కు వెళ్లి పిస్టల్స్ మరియు బుల్లెట్లను సేకరించి తిరిగి కాశీకి వచ్చి, తిరిగి వెళ్లే క్రమంలో ఆదిలా బాద్ జిల్లా చాంద టి బైపాస్ రోడ్డు వద్ద పక్కా సమాచారం తో ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్ మరియు సిబ్బంది కలిసి తనిఖీ చేయగా ఏ2 దిలీప్ మరియు ఏ3 హిమకాంత్ రెడ్డి లు నాలుగు 7.65 ఎంఎం పిస్టల్స్, 8 మ్యాగజైన్లు, 18 లైవ్ రౌండ్ లను, వాడినా కారును స్వాధీనం చేసుకొని ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. వీరందరిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 231/2024 తో %ంవషె% 61(2)(ఏ), 109 (1) ఆర్/డబ్ల్యు 3(5) బిఎన్ఎస్, సెక్షన్ 25(1ఏ) అర్మ్స్ యాక్ట్, 1959. ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా గురువారం రాత్రి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న సూత్రధారి ఏ1 వెంకట్ రెడ్డి మరియు మరియు పిస్టల్స్ కొనుగోలుకు ఆర్థిక సహాయం చేసిన ఏ4 ప్రసన్న రాజులను గత రాత్రి అరెస్టు చేసి శుక్రవారం ఉదయం రూరల్ పోలీస్ స్టేషన్ కు తీసుకురావడం జరిగిందని. ముఖ్యంగా ఈ కేసు నందు ఏ2 మైల దిలీప్ శ్రీశైలం రుచులు అనే రెస్టారెంట్ ఏర్పాటు అనుమతులపై తనకు పరిచయమున్న ఏ1 వెంకటరెడ్డికి సున్నిపెంట గ్రామం నందు ఆదిత్య రెస్టారెంట్ యజమాని ని సహాయం కోరడం జరిగింది. తదుపరి మైల దిలీప్ రెస్టారెంట్లో పని చేసే బీహార్ వాస్తవ్యుడైన భైరవతో బేరాన్ని ఏర్పాటు చేసుకొని, ఏ1 వెంకటరెడ్డి ఇంటి నుండి ఏ4 నల్లగంటి ప్రసన్న రాజు చేసిన ఆర్థిక సహాయంతో డబ్బులను తీసుకొని ఏ2 దిలీప్ మరియు ఏ3 హిమకాంత్ రెడ్డి, కుక్ భైరవ్ చెప్పిన వ్యక్తి సహాయంతో కాశి కి వెళ్లి అక్కడ రెండు రోజులపాటు ఉండి బీహార్ మ్యుంగిర్ రైల్వే స్టేషన్ లో పిస్టల్స్ ను తీసుకొని ఆదిలాబాద్ మీదుగా తిరిగి వస్తున్న క్రమంలో ఈ అరెస్టు జరిగిందని తెలిపారు. ఏ1 వెంకట్ రెడ్డి పై ఇదివరకే టాడా కేసు, వివిధ సంఘవిద్రోవశక్తుల కేసుల లో, హత్య కేసులలో కీలక పాత్రగా వ్యవహరిస్తున్నట్లు ఇదివరకే ఇతనిపై మూడు హత్య కేసులు, ఒక హత్య ప్రయత్నం కేసు, నాలుగు జనశక్తి కి సంబంధించిన కేసులు,రెండు టాడా కేసులు మొత్తం 10 కేసులలో పాత్ర ఉన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అదేవిధంగా మిగిలిన నిందితులను అరెస్టు చేయడానికి ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు పంపడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఆదిలాబాద్ జిల్లా పోలీసు అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డి.ఎస్.పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు కే ఫణిదర్, కరుణాకర్, డి సాయినాథ్, ఎస్సైలు ముజాహిద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చొరవ తీసుకోవాలి




**- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**

**జగిత్యాల బ్యూరో ( మన వెలుగు ) నవంబర్ 22 :** జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధ్యక్షతన స్థానిక ఐడిఓసి కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు బస్తీ దవాఖాన లోని వైద్యాధికారులకు వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భవతుల నమోదు కార్యక్రమం 100 శాతం నమోదు చేయాలని, కలెక్టర్ అందరికీ టీ డి వ్యాక్సిన్ వేయాలని, నాలుగు ఏ ఎన్ సీ చెకప్ లు చేయించి గవర్నమెంట్ హాస్పిటల్స్ నందు డెలివరీలు ప్రోత్సహించాలని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక చొరవ చూపి, గర్భిణి లను మొదటి త్రైమాసికంలోని నమోదు చేసి, మొదటి నుండి వారికి సరైన మార్గదర్శనం చేస్తూ సేవలు అందించడం ద్వారా నమ్మకాన్ని చూరగొని, ప్రభుత్వ ఆసుపత్రులు, సేవలపై నమ్మకం పెంపొందించి, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయ్యేలా చూడాలని తెలిపారు. వైద్య అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతివారం సమీక్షా సమావేశం నిర్వహించి గర్భవతుల నమోదు, గవర్నమెంట్ హాస్పిటల్స్ లో డెలివరీలు ఎన్ సి డి స్క్రీనింగ్ మొదలగునవి అన్ని పారామీటర్స్ లో సమీక్షించాలని సూచించారు.పుట్టిన పిల్లలందరికీ వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయించవలెనని సూచించారు.అభా కార్డు జనరేషన్ చాలా తక్కువగా ఉంది కావున ఎన్సిడి స్క్రీనింగ్ చేసేటప్పుడు, వ్యాది నిరోధక టీకాలు వేయు సమయంలో అభా కార్డు జనరేషన్ నమోదు చేయవలెనని ఆదేశించారు. పర్యవేక్షకులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఆశ మరియు ఏఎన్ఎం లకు మార్గదర్శనం చేస్తూ నిరంతరం వారినికి అందుబాటులో ఉంటూ, సేవలు పెంపొంది న్చాలని ఆదేశించారు.జాతీయ టీ.బి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తొందరగా వ్యాధిగ్రస్తున్ని గుర్తించి సరైన చికిత్స అందించడం ద్వారా ,వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చుని, వ్యాది గ్రస్తులు, తొందరగా కోలుకునేలా చేయవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ప్రమోద్ కుమారు తెలిపారు. తెమడను (టి. హబ్ ) వాహనం ద్వారా, పంపించి పరీక్ష చేయించాలని తెలిపారు.వ్యాది నిరోధక కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించుటకు, జిల్లాస్థాయి ప్రత్యేక వర్క్ షాప్ ఏర్పాటు చేసి, లాజిస్టిక్,వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు పరచడం జరుగుచున్నదని, జిల్లా వ్యాదినిరోధక అధికారి డా. ఎ శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రీయ బాల సంరక్షణ కార్యక్రమం క్రింద జిల్లా లో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థుల కు, వైద్య పరిక్షలు నిర్వహిస్తూ చికిత్స అందించి, అవసరమైతే ఉన్నత ఆసుపత్రులకు సిఫారసు చేయడం, కార్యక్ర మాన్ని సమర్థవంతంగా అమలుపరుచుటకు వాహనాలు జి.పి. ఆర్. స్ సదుపాయం కలిగించి ట్రాక్ చేయిస్తున్నట్లు తెలిపారు.అసంక్రమిక వ్యాధుల నియంత్రణ కార్యక్రమం ద్వారా, బి.పి. షుఘర్, క్యాన్సర్ మో. వ్యాదులలో బాద పడుచున్నవారిని తొందరగా గుర్తించుటకు గాను సర్వే నిర్వహించం, సరియైన చికిత్స అందేలా చూడటం, వాతావరణ మార్పులకు అనుగుణంగా జీవన విధానాల మార్పు గూర్చి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, చైతన్య పరుచడం జరుగుతుందని జిల్లా అసంక్రమిక వ్యాదుల నియత్రణ కార్యక్రమ అధికారి డా. అర్చన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యం ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె ప్రమోద్ కుమార్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఏ శ్రీనివాస్, డా.అర్చన, మాతా శిశు ఆరోగ్య కార్యక్రమ జిల్లా అధికారి డా. యం. జైపాల్ రెడ్డి , ఎన్ హెచ్ ఎం ప్రోగ్రాం అధికారి తులసి రవీందర్ , ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారి, పర్యవేక్షకులు జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటిని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**- విద్యార్థులతో కలిసి సౌకర్యాలపై ఆరా**

**- ఆత్మహత్యలు చేసుకొని భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దు**

**- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే**



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) నవంబర్ 22 :** బాసర త్రిబుల్ ఐటీని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇటీవలే త్రిబుల్ ఐటీ లో స్వాతి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం, పెద్ద మొత్తంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఆయ న బాసర త్రిబుల్ ఐటీ కి వెళ్లి విద్యార్థులను కలిసి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయన్న విషయంలో ఆరా తీశారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకొని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఏదైనా సమస్యలుంటే తనకు నేరుగా కాల్ చేయాల్సిందిగా సూచించారు. ఏదైనా కష్టం వస్తే ఆత్మహత్య పరిష్కారం కాదని, సమస్యను తోటి మిత్రులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యతో ఏదైనా సాధించగలుగుతామని, మనిషికి ఆస్తులు, అంత స్తుల కంటే విద్యనే ప్రాధాన్యమని చెప్పారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, త్రిబుల్ ఐటీ లో బోధన, క్రీడా, ఇత రత సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వైస్ ఛాన్స లర్ గోవర్ధన్ తో సమావేశమయ్యారు. విద్యార్థుల ఆత్మ హత్యల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచిం చారు. అదేవిధంగా విద్యార్థులకు అందుతున్న ప్లేస్మెంట్స్ ను అడిగి తెలుసుకున్నారు. ఏయే కంపెనీల్లో విద్యార్థులు ఉద్యోగాలకుసెలెక్ట్ అవుతున్నారన్న విషయంపై చర్చించా రు. ఈ సందర్భంగా త్రిబుల్ ఐటీ అధ్యాపకులు ఎమ్మెల్యే కు కొన్ని సమస్యలను తెలియజేశారు.సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు.తాను ఇచ్చిన మాట ప్రకారం విద్య పైనే ప్రధాన దృష్టి సారిస్తానని అందులో భాగంగానే పలుమార్లు త్రిబుల్ ఐటీని సందర్శించడం జరిగిందని, సమస్యలపై మొట్టమొదటిసారిగా అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానన్నారు. ఎంఎల్ఏ వెంట భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, నాయకులు వెంగల్ రావు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వంద శాతం ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి


**- జిల్లా పాలనాధికారి రాజర్షి షా**



**ఆదిలాబాద్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :** జిల్లా కేంద్రంలో స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కింది అంశాలపై సమావేశం నిర్వహించారు.స్క్రీనింగ్ ట్రీట్మెంట్ ఎస్ ఎస్ ఎఫ్. పి.ఆఫ్ శామ్,మామ్, ఎస్.యు.డబ్ల్యూ, ఎం.యు.డబ్ల్యూ, ఆరోగ్య పాఠశాల,ఎం సి హెచ్,టీ.బి, బిసిజి, టీ హబ్, అవలీబుల్ ఆఫ్ మెడిసిన్,102,108 ఫంక్షన్ఇంగ్, పీఎం జన్ మన్.ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ....ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం లో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు.గర్భిణీ స్త్రీలను ప్రయివేట్ ఆసుపత్రులకు పంపించకుండా స్థానిక ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆశ, ఏఎన్ఎం , అంగన్వాడి టిచర్ లు ఇంటిం టికి వెళ్లి గర్భిని స్త్రీలను రిజిస్ట్రేషన్ చేయించి వారికి పౌష్టికాహారం అందిం చి ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలవరి అయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు.అనంతరం మెడికల్ ఆఫీసర్ లను పీహెచ్సీల వారిగా అడిగి తెలుసు కున్నారు.

## బోథ్ నియోజకవర్గంలో దేవాలయాలకు నిధులు ఇవ్వండి

## బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్



**ఆదిలాబాద్ ప్రతినిధి ( మన వెలుగు ) నవంబర్ 22 :** బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలకు పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయాలని, టెండర్ దశలో ఉన్న బోథ్ పట్టణ కేంద్రంలోగల శ్రీ భక్త శివ మార్కండేయ ఆల యానికి టెండర్లు పిలవాలని బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని సచివాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని దేవాలయాలకు కావలసిన నిధులు మంజూరు చేస్తామని, నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయించి ఆధ్యాత్మిక వాతావర ణాన్ని కలగజేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు, గిరిజన ఆదివాసి గూడాలలో వారి సంస్కృతి సాంప్రదా యాలు ఉట్టిపడే విధంగా దేవాలయాల నిర్మాణానికి కృషి చేయాలని, బోత్ శివ మార్కండేయ ఆలయానికి అవస రమాగు నిధులు మంజూరు చేయించడంతోపాటు, ప్రారంభోత్సవానికి రావాలని మంత్రిని బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ కోరారు.బిఈ కార్యక్రమంలో ఖానా పూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కోమురం కోటేశ్వర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు భోజన్న , మాజీ ఎంపీపీ మల్లేష్ పాల్గొన్నారు.

# కృష్ణవేణి తీరంలో పవిత్ర క్షేత్రాలు



**పుష్కరాల సమయంలో కృష్ణలో స్నానాదులు, పూజలు, దానధర్మాలు, పితృ దేవతలకు పిండప్రదానాలు, జపాలు చేస్తే పుణ్య ఫలాలు సంప్రాప్తిసాయని పురాణాలు చెబుతున్నాయి. పుష్కరాలలో నదీ స్నానం చేస్తే పన్నెండు సంవత్సరాలపాటు ఆ నదులలో నిత్యం స్నానం చేసినంత పుణ్య ఫలం లభిస్తుందంటారు. అలాగే జన్మజన్మల పాపాలూ నశించి, మోక్షప్రాప్తి కలుగుతుంది. ఏ నదికి పుష్కరాలు వస్తాయో ఆ నదిపేరును మనం స్నానం చేసేటప్పుడు ముమ్మారు మనస్సులో తలచుకున్నా కొంతమేర పుష్కర స్నానఫలితం పొందచ్చునని శాస్త్రవచనం.**

పుష్కర కాలంలో చేసే ఆయా కర్మల వలన శారీరక, మానసిక మలినాలు తొలగి పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సు కలుగుతాయి. బంగారం, వెండి, భూమి, ధనం, గోవులు, ధాన్యం, లవణం, రత్నాలు, అశ్వం, పండ్లు, బెల్లం, వస్త్రాలు, తైలం, కూరగాయలు, తేనె, పీట, అన్నం, పుస్తకం %ా% ఇలా ఎవరి శక్తిని బట్టి వారు ఈ పుష్కర సమయంలో దానం చేస్తే పుణ్య ఫలాలు సిద్ధిస్తాయంటారు. మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతశ్రేణిలో మహాబలేశ్వరం వద్ద ఉద్భవించిన కృష్ణా నది మహాబలేశ్వర లింగం పైనుంచి ప్రవహించి నదిగా మారింది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి మీదుగా ఏటిమొగ, ఎదురుమొండి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. తుంగభద్ర, వేణి, మూసీ, దిండి, పాలేరు, మున్నేరు దీనికి ఉప నదులు. వీటిలో తుంగభద్ర, మూసీ నదులు ఇతర జీవ నదులకు మల్లే ప్రఖ్యాతి చెందాయి. కృష్ణానది పుష్కర కాలంలో ఆయా నదిలో స్నానాదికాలు, జప, తపాలతో పాటు ఆయా నదికి సమీపంలో ఉన్న ఆలయాల సందర్శనం ఆధ్యాత్మికానందాన్ని సొంతం చేయడంతో పాటు, మానసికానందన్నిచ్చి, పుణ్య ఫలాలు సొంతమవుతాయని పెద్దలు చెబుతారు. ఆకారణంగా నదికి సమీపంలోనూ, నది ఒడ్డున ఉన్న ఆలయాల సందర్శనం సర్వ విధాల మేలు చేస్తుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటక లోకి ప్రవేశించిన కృష్ణా నది మహబూబ్ నగర్ జిల్లాకు సమీపంలో మక్తల్ మండలంలో తెలంగాణలోకి ప్రవేశిస్తుంది.

**దత్తాత్రేయ స్వామి దేవాలయం వల్లభాపురం(మక్తల్ )**

మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ మండల కేంద్రంలో గల వల్లభాపురం గ్రామంలో వెలసిన మహిమాన్వితమైన దత్తాత్రేయ క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభ స్వామి దేవాలయం . దత్తాత్రేయ స్వామి మొదటి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ స్వామి వెలసిన క్షేత్రమిది. శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మ స్థలం పిఠాపురం అయితే తన తపస్సు, ధ్యానం అన్ని కురవాపురం లోనే జరిగాయని పురాణాల ద్వారా అవగతమవుతోంది. వల్లభాపురం తెలంగాణా, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మహిమాన్విత దత్త క్షేత్రం. కృష్ణా నదికి ఇవతలి వైపు వల్లభాపురం ఉండగా, అవతలి వైపు కురువాపురం ఉంటుంది.

కృష్ణా నది సమీపంలో వెలసిన మహిమాన్విత దత్త పీఠమిది. శ్రీపాద శ్రీవల్లభ స్వామి దేశమంతా తిరుగుతూ, ఈ క్షేత్రానికి వచ్చి కొన్ని రోజులు ఇక్కడ నివాసముండి భక్తుల కష్టాలు తీర్చాడట. కష్టాలు, కలతలతో బాధపడేవారు, దుష్ట శక్తుల బారి నించి విముక్తి కోరుకునేవారు ఇక్కడ స్వామిని పూజిస్తే కోరికలు నెరవేరుతాయని స్థల పురాణం చెబుతోంది.

కురుపురం, కురువాపురం, కురుంగడ్డ తదితర పేర్లతో పిలుచుకునే శ్రీపాద శ్రీవల్లభ క్షేత్రం తెలంగాణ కర్ణాటక సరిహద్దులో ఉంది. మక్తల్ నుంచి అనుగొండ వెళ్ళే బస్సులో పంచదేవ్ పహాడ్ గ్రామాన్ని చేరుకుని అక్కడ నుంచి సమీపంలోనే ఉన్న కురుపురం చేరుకోవచ్చు. కురుపురం ఒక ద్వీపంలో ఉంది. చుట్టూ కృష్ణా నది. ఈ నది దాటితే స్వామి వారి ఆలయం ఉంది. శ్రీపాద శ్రీవల్లభులు చాలా సంవత్సరాలు కురుపురంలో తపస్సు చేశారు. శ్రీపాద శ్రీ వల్లభ స్వామి తపస్సు చేసిన ఈ ప్రాంతంలో ఒక చిన్న ఆలయం ఉంది. సమీపంలోనే వాసుదేవానంద సరస్వతి స్వామి వారు తపస్సు చేసిన గుహ, శివాలయం దర్శించుకోవచ్చు. కురు మహారాజుకు జ్ఞాన సిద్ది కలిగిన ప్రదేశం కాబట్టి కురుపురమనే పేరు వచ్చింది. దీనికి సమీపంలోనే పంచదేవ పహాడ్ ఉంది. మక్తల్ మండలంలో ఉన్న ఈ క్షేత్రంలో పాండురంగ స్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి, ఆంజనేయ స్వామి, రాఘవేంద్ర స్వామి, వినాయకునితో పాటు అనఘ దత్త దేవాలయాలు ఒకే చోట దర్శనమిస్తాయి.

**ఆంజనేయ స్వామి ఆలయం, బీచుపల్లి**

మహబూబ్ నగర్ జిల్లా ఇటిక్యాల మండలం కృష్ణా నది ఒడ్డున బీచుపల్లి గ్రామంలో వెలసిన మహిమాన్విత ఆలయమిది. పదహారవ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం, తొమ్మిదవ శతాబ్దానికి చెందిన చోళ రాజ్యంలో ప్రాచుర్యం పొందిందని ఇక్కడి చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. ఇక్కడ స్వామిని బీచుపల్లిరాయుడని భక్తులు భక్తితో పిలుచుకుంటారు. ఇక్కడ ఈ ఆలయంలో స్వామివారి మొదటి పూజను బోయవారు చేయడం ఈ ఆలయం విశేషంగా చెబుతారు. స్వామి వారి ఆదేశం మేరకు ఈ సంప్రదాయం ఇలా కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇక్కడ స్వామివారిని వ్యాస రాయల వారు ప్రతిష్ఠించినట్లు ఇక్కడి స్థల పురాణాలు చెబుతున్నాయి. అలాగే రెండు శతాబ్దాల క్రితం గద్వాల రాజులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. గర్భాలయంలో స్వామివారి మూర్తితోపాటు ఎడమ వైపున మహేశ్వర లింగం, కుడివైపున సీతా లక్ష్మణ సహిత శ్రీరాముడు కొలువుదీరి ఉన్నారు.

**సోమేశ్వర స్వామి ఆలయం, సోమశిల:**

మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమశిలలో సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాల నేపథ్యంగా అలరారుతున్న ఈ దివ్యాలయం ప్రాంగణంలోని కృష్ణా నదిలో పుష్కర స్నానాదికాలు చేస్తే విశేష పుణ్యఫలాలు సొంతమవుతాయని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. సోమశిలలోని శ్రీలలితా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని ఏడవ శతాబ్దంలో నిర్మించినట్లు చెబుతారు. శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఈ ఆలయం నదిలో మునిగిపోకుండా గట్టున ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించారు. ఈ ఆలయం పదిహేను ఆలయాల సముదాయంగా విరాజిల్లుతోంది. జ్యోతిర్లింగాలుగా ప్రసిద్ధమైన ద్వాదశ లింగాల ప్రతిరూపాలను ఒకే చోట ఆలయంలో ప్రతిష్టించారు. ఈ ఆలయాలలోని అన్ని గర్భగుడుల లలాట బింబంగా గజలక్ష్మి ఉండడం ఈ ఆలయ విశేషంగా చెబుతారు. ఆలయం ముందు భాగంలో రెండు శాసనాలున్నాయి. కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రైలోక్య మల్ల ఒకటవ సోమేశ్వరుని పాలన కాలంలో, కాకతీయ మహారాజు రెండో ప్రతాప రుద్రుని కాలంలోనూ ఈ శాసనాలు వేసినట్లు ఇక్కడి ఆధారాల ద్వారా అవగతమవుతోంది.









**అలంపురం ఆలయాలు**

అలంపురం సమీపంలో కృష్ణా, తుంగభద్ర నదులు సంగమించడం వల్ల ఈ ప్రాంతాన్ని దక్షిణకాశిగా అభివర్ణిస్తూ ఉంటారు. మహబూబ్‌నగర్‌కి 90 కిలోమీటర్ల దూరంలోనూ, హైదరాబాద్‌కి 200 కిలో మీటర్ల దూరంలోనూ నెలకొని ఉన్న అలంపురం అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదవది. అలాగే, ఈ క్షేత్రంలో నవ బ్రహ్మలు కొలువై ఉన్నారు. క్రీస్తు శకం ఏడవ శతాబ్దంలో బాదామీ చాళుక్యులు ఈ ఆలయాలను నిర్మించారు. అలంపురం చుట్టూ నల్లమల అడవులు వ్యాపించి ఉన్నాయి. తుంగభద్ర నది ఎడమ గట్టున అలంపురం ఆలయం ఉంది. శాతవాహన, బాదామీ చాళుక్యులు, కాకతీయులు, విజయనగర సామ్రాజ్యాధిపతులు, గోల్కొండకి చెందిన కుతుబ్ షాహీ ల కాలంలో ఈ ఆలయం అభివృద్ధి చెందింది. జోగులాంబ, బ్రహ్మేశ్వరస్వామి వార్ల ఆలయాలు చారిత్రక ప్రసిద్ధి చెందినవి. అలంపురాన్ని పూర్వం హలంపురంగానూ, హటాంపురంగానూ వ్యవహరించేవారని క్రీస్తు శకం 1101 సంవత్సరం నాటి శాసనం తెలియజేస్తోంది. ఈ శాసనం పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిత్య-4 కాలం నాటిది. జోగులాంబ ఆలయం అలంపురంలో ఆగ్నేయ దిశగా నెలకొని ఉంది. ఈ ఆలయాన్ని 14వ శతాబ్దంలో బహమనీ సుల్తానులు ధ్వంసం చేయగా, జోగులాంబ, చండి, ముండి విగ్రహాలను బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో భద్రపర్చారు. కొద్ది సంవత్సరాల క్రితం జోగులాంబ ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. సతీదేవికి చెందిన పై దవడ పంటితో సహా ఇక్కడ పడినట్టు పురాణకథనం. అమ్మవారు ఉగ్రరూపంతో దర్శనమిస్తారు. మొదట అమ్మవారి విగ్రహం ఇక్కడున్న బాల బ్రహ్మేశ్వరాలయంలో ఉండేది. 2008లో అమ్మవారికి ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించి, తిరిగి ప్రతిష్టించారు. అలంపూర్‌కు ఈశాన్యంలో కృష్ణా, తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో కూడవెల్లి అనే గ్రామంలో సంగమేశ్వరాలయం ఉండేది. ఈ గ్రామం, ఆలయం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురికావడంతో ఇక్కడి సంగమేశ్వరాలయాన్ని తరలించి అలంపూర్‌లో పునర్నిర్మించారు. ఈ ఆలయ శిల్పసంపద ఆకట్టుకుంటుంది. ఈ దేవాలయం కూడా చాళుక్యుల నిర్మాణ శైలిలోనిదే. అలాగే, అలంపురం సమీపంలోని పాపనాశంలో ఇరవై దేవాలయాలు ఒకేచోట ఉండటం వల్ల అలంపురం ఆలయాల పట్టణంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఏడవ శతాబ్ది నుంచి 17వ శతాబ్ది వరకూ దక్షిణాపథాన్ని పరిపాలించిన రాజవంశీయుల శాసనాలు ఇక్కడ ఉన్నాయి. ప్రాచీన శిల్పకళకు కాణాచి అయిన ఈ ఆలయం అడుగడుగునా విజ్ఞాన విశేషాలకు ఆలవాలంగా ఉంది. వైదిక మతానికి చెందిన ఆలయాలు, జైన, బౌద్ధుల కాలం నాటి శిల్పనిర్మాణాలు ఇక్కడ ఎన్నో దర్శనమిస్తాయి. ఈ ఆలయం మహాద్వారాన్ని రాష్ట్ర కూటుల హయాంలో నిర్మించినట్టు చారిత్రక కథనం. కాకతీయుల కాలంలో ఇక్కడ మండపాలను నిర్మించారు. శ్రీకృష్ణ దేవరాయలు రాయచూర్ నుంచి ఈ ఆలయానికి వచ్చి అనేక మాన్యాలిచ్చినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మట్టంపల్లి, నల్గొండ జిల్లా**

నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ సమీపంలోని మట్టంపల్లి గ్రామంలో కృష్ణా నదీ తీరాన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. తెలుగునాట పంచ నారసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రమే మట్టపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం. ఈ ఆలయానికి దాదాపు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. మట్టపల్లిలో వెలసిన స్వామి కొన్నాళ్లు ఎవరికీ కనిపించకుండా గుహలో దాగి ఉండేవాడట. ఇదే గుహలో భరద్వాజ మహర్షి తపస్సు చేయడంతో ప్రత్యక్షమైన స్వామి ఇక్కడే వెలిశాడని, ఒక్క భరద్వాజ మహర్షి మాత్రమే అప్పట్లో స్వామివారిని ఆరాధించుకునేవారని ప్రతీతి. ఈ ఆలయంలో దేవనాగరి లిపిలో ఉన్న శిలాశాసనం ఆధారంగా ఈ ఆలయం 1100 సంవత్సరాల కిందటిదని తెలుస్తోంది. కొండ మీద స్వామి స్వయంభువుగా వెలిశాడు. ఇక్కడ స్వామితో పాటే ఒక దక్షిణావృత శంఖం కూడా ఆవిర్భవించింది. గుంటూరు జిల్లాలోని తంగెడ గ్రామానికి చెందిన మాచిరెడ్డి అనే భక్తుడికి స్వామి కలలో కనిపించి, తాను ఇక్కడ కొండగుహలో వెలిశానని, తనను వెలికితీసి, పునఃప్రతిష్టించమని ఆదేశించాడట. ఆ భక్తుడు గుహలోనున్న స్వామి విగ్రహాన్ని వెలికితీసి, ఆలయం నిర్మించినట్లు ఇక్కడి స్థలపురాణాలు చెబుతున్నాయి. నాటి నుంచి ఈ ఆలయంలో రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామిని భక్తులు పూజించడం మొదలైంది. ఈ ఆలయంలో స్వామివారికి ప్రీతిపాత్రమైన ఆరె ఆకులను దండలుగా చేసి అలంకరిస్తారు. పశ్చిమాభిముఖంగా ఉన్న స్వామివారి గుహాలయానికి అనుకుని గోదాదేవి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, నాగేశ్వర ఆలయం తదితర ఆలయాలు ఉన్నాయి. ఈ క్షేత్రానికి యమమోహిత క్షేత్రమని కూడా పేరుంది. యమధర్మరాజు స్వయంగా ఈ ఆలయంలో స్వామి వారి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వల్ల దీనికాపేరు వచ్చిందంటారు. హైద్రాబాద్ నుంచి వచ్చే భక్తులు రోడ్డు మార్గంలో కోదాడ వరకు వచ్చి అక్కడ నుంచి ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. అలాగే మిర్యాలగూడ మీదుగా కూడా ఇక్కడకు చేరుకోవచ్చు.

**శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం, దామెరచర్ల**

నల్గొండ జిల్లా దామెరచర్ల మండలంలో విష్ణుపురానికి సమీపంలో కృష్ణా, మూసీ నదుల సంగమ క్షేత్రంలో వెలసిన పుణ్య క్షేత్రమిది. ఇదో ప్రాచీన మహానగరం. 11,12 శతాబ్దాల కాలంలో ఈ క్షేత్రం గొప్ప ఓడరేవుగా ఉండేదని, వోడపల్లి కాలక్రమంలో వాడపల్లిగా, వజీరాబాద్ గా మారిందని చెబుతారు. అలాగే ఈ ప్రాంతాన్ని పూర్వం బదరికారణ్యం అని పిలిచేవారు. ఆరు వేల సంవత్సరాలకు పూర్వం అగస్త్య మహాముని, తన ధర్మపత్ని లోపాముద్రతో శివకేశవులను తన పూజా కావిడిలో ఉంచుకుని, వారిని ప్రతిష్ఠించే పవిత్ర ప్రదేశం కొరకు ముల్లోకాలు తిరుగుతూ భూలోకం చేరారట. ఉత్తరకాశీకి వెళ్ళే క్రమంలో ఈ బదరికారణ్యాన్ని చేరుకున్నారట. ఈ పవిత్ర క్షేత్రంలోకి రాగానే నరసింహ స్వామి తానా ప్రదేశంలోనే ఉండ దలచినట్లు ఆకాశవాణి వినిపించిందట. అంతట ఆ ముని దంపతులు శ్రీ లక్ష్మీసమేతునిగా నరసింహుని ప్రతిష్ఠించి ఈ క్షేత్ర పవిత్రతను ఇనుమడింప చేశాడని ఇక్కడి స్థల పురాణాల ద్వారా అవగతమవుతోంది. మరో కథనం మేరకు వ్యాస భగవానుడి కోరిక మేరకు లక్ష్మీనరసింహ స్వామి ఈ క్షేత్రంలో కొలువుదీరినట్లు చెబుతారు. ఈ ఆలయం దక్షిణ ముఖంగా ఉంటుంది. విష్ణుకుండినులు, చాళుక్యులు, కుందూరు చోళులు, రేచర్ల పద్మ నాయకులు, రెడ్డి రాజులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తోంది. శిథిలమైన ఆలయాన్ని 13వ శతాబ్దంలో అనవేమారెడ్డి పునర్నిర్మాణం చేసి వసతులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎరయ తొండయ చోళుడు క్రీ.శ. 1050, 1065 మధ్య అద్భుతమైన వాడపల్లి దుర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. 12వ శతాబ్దంలో రెడ్డి రాజులు ఈ ప్రదేశంలో పట్టణ నిర్మాణానికై తవ్వకాలు జరుపుతుండగా స్వామి వారి విగ్రహం బయట పడిందని, వారు అక్కడే ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి క్రీ.శ. 1377లో ఆలయ నిర్మాణం చేసినట్లు శాసనాల ద్వారా అవగతమవుతోంది.

**పుష్కరాల సమయంలో దర్శించుకోదగ్గ ఇతర ఆలయాలు**

వీటితో పాటు మాగనూరు మండలం తంగిడి పుష్కర ఘాట్ సమీపంలోని వల్లభేశ్వరస్వామి ఆలయం, దత్తాత్రేయస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి, గుడెబల్లూరు ఘాట్ స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, మక్తల్ మండలం పస్పుల ఘాట్ సమీపంలోని శ్రీదత్తాత్రేయస్వామి . పరెవుల ఘాట్ సమీపంలోని శంకర లింగేశ్వర స్వామి ఆలయాలు దర్శించుకోవచ్చు. అలాగే ఆత్మకూరు మండలం నందిమళ్ల ఘాట్ సమీపంలోని శివాలయం, మూలమళ్ల ఘాట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం, జూరాల ఘాట్ దగ్గర శివాలయాలు. పెబ్బేరు మండలం రంగాపూర్ ఘాట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకునే వీలుంది. ధరూర్ మండలం పెద్దచింతరేవుల ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం, వీపనగండ్ల మండలం పెద్దమరూర్ ఘాట్ ఈశ్వర ఆలయం, జటప్రోలు మదనగోపాల స్వామి, కొల్లాపూర్ మండలం సింగోటం శ్రీలక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయం, శ్రీ అగస్తేశ్వర ఆలయాలు కూడా పుష్కరాల సమయంలో దర్శించుకోవచ్చు. అలాగే, అమరగిరి ఘాట్ అమరేశ్వర ఆలయం, పెబ్బేరు మండలం గుమ్మడం ఘాట్ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయం, రామ్‌పూర్ ఘాట్ శ్రీరామాలయం, ముంగమందిన్నె ఘాట్ శ్రీ ఆంజనేయస్వామి, రామాలయాలు. వీపనగండ్ల మండలం చెల్లపాడు ఘాట్ శివాలయం, కొల్లాపూర్ మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం ఘాట్ సమీపంలోని శ్రీ రామతీర్థస్వామి ఆలయం, శివాలయం. అచ్చంపేట మండలం పాతాళగంగ పుష్కరఘాట్ దగ్గర్లోని దత్తాత్రేయ స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చు. వీటితో పాటు ధరూర్ మండలం నెట్టెంపాడు శివాలయం, ఉప్పేరు, రేవులపల్లి ఘాట్ సమీపంలోని శివాంజనేయస్వామి ఆలయాలు, గద్వాల మండలం రేకులపల్లి ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం, నదీ అగ్రహారం రామావధూత మఠం, బీరెల్లి చెన్నకేశవస్వామి ఆలయాలు, అలంపూర్ మండలం క్యాతూరు వెంకటేశ్వరస్వామి ఆలయం, గొందిమళ్ల ఘాట్ సమీపంలోని జూంకారేశ్వరీదేవి ఆలయాలు కూడా పుష్కర సమయంలో దర్శించుకునే మహాద్భాగ్యం కలుగుతుంది.

# జన్మనక్షత్ర పాదమును బట్టి శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం



**హరిః ఓమ్..**

అశ్వని 1వ పాదం
విశ్వం విష్ణు ర్వషట్కారో భూత భవ్య భవత్ ప్రభుః 01
భూతకృత్ భూతభృద్భావో భూతాత్మా భూతభావనః

అశ్వని 2వ పాదం
పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః 02
అవ్యయః పురుష స్సాక్షీ క్షేత్రజ్ఞో క్షర ఏవచ

అశ్వని 3వ పాదం
యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః 03
నారసింహవపు శ్రీమాన్ కేశవః పురుషోత్తమః

అశ్వని 4వ పాదం
సర్వ శ్శర్వ శ్శివ స్థాణుః భూతాది ర్నిధి రవ్యయః 04
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః

భరణి 1వ పాదం
స్వయంభూ శ్శంభు రాదిత్యః పుష్క రాక్షో మహాస్వనః05
అనాదినిదనో ధాతా విధాతా ధాతు రుత్తమః

భరణి 2వ పాదం
అప్రమేయో హృషీకేశః పద్మనాభో మరప్రభుః 06
విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠః స్థవి రో ధ్రువః

భరణి 3వ పాదం
అగ్రాహ్య శ్శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్ధనః 07
ప్రభూత స్త్రికకుద్ధామ పవిత్రం మంగళం పరమ్

భరణి 4వ పాదం
ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః 08
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః

కృత్తిక 1వ పాదం
ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః 09
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతి రాత్మవాన్

కృత్తిక 2వ పాదం
సురేశ శ్శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః 10
అహ స్సంవత్సరో వ్యాళః ప్రత్యయ స్సర్వదర్శనః

కృత్తిక 3వ పాదం
అజ స్సర్వేశ్వర స్సిద్ధః సిద్ధి స్సర్వాది రచ్యుతః 11
వృషాకపి రమేయాత్మా సర్వయోగ వినిస్సృతః

కృత్తిక 4వ పాదం
వసు ర్వసుమనా స్సత్యః సమాత్మా సమిత స్సమః 12
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః

రోహిణి 1వ పాదం
రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోని శ్శుచిశ్రవాః 13
అమృత శ్శాశ్వతః స్థాణుః వరారోహో మహాతపాః

రోహిణి 2వ పాదం
సర్వగ స్సర్వవిద్భానుః విష్వక్సేనో జనార్ధనః 14
వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః

రోహిణి 3వ పాదం
లోకాధ్యక్ష స్సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః 15
చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః

రోహిణి 4వ పాదం
భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా సహిష్ణు ర్జగదాదిజః 16
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః

మృగశిర 1వ పాదం
ఉపేంద్రో వామనః ప్రాంశుః అమోఘ శ్శుచి రూర్జితః 17
అతీంద్ర స్సంగ్రహ స్సర్గో ధృతాత్మా నియమో యమః

మృగశిర 2వ పాదం
వేద్యో వైద్య స్సదాయోగీ వీరహా మాధవో మధుః 18
అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబ లః

మృగశిర 3వ పాదం
మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్త ర్మహాద్యుతిః 19
అనిర్దేశ్యవపు శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృత్

మృగశిర 4వ పాదం
మహేష్వాసో మహీభర్తా శ్రీనివాస స్సతాంగతిః 20
అనిరుద్ధ స్సురానందో గోవిందో గోవిదాం పతిః

ఆరుద్ర 1వ పాదం
మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః 21
హిరణ్యనాభ స్సుతపాః పద్మనాభః ప్రజాపతిః

ఆరుద్ర 2వ పాదం
అమృత్యు స్సర్వదృక్ సింహః
సంధాతా సంధిమాన్ స్థిర ?